సాక్షి తిరుపతి

మంగళవారం । 3 । జూన్ । 2025

I



మోటార్ల దొంగలు అరెస్ట్

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వ్యవసాయ బోరు మోటార్ల దొంగలను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. - IIలో



నెత్తిన బరువు పెట్టారు బాబూ!

జిల్లాలో రేషన్ కష్టాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో రెండో రోజు సోమవారం చౌకదుకాణాల వద్ద క్యూ కట్టారు. - IIలో



286 కిలోల ఎర్రచందనం స్వాధీనం

286 కిలోల ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్న ఘటన రేణిగుంటలో చోటు చేసుకుంది. - IIలో

న్యూస్‌రీల్

మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మృత్యుంజయ స్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన చేశారు. అనంతరం స్వామి వారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూధి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 78,031 మంది స్వామివారిని దర్శించుకోగా 32,936 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.46 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని, కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలలో అనుమతించరని టీటీడీ విజ్ఞప్తి స్పష్టం చేసింది.

ఆగమ సలహాదారుగా వేదిక్ ఆచార్యులు



భావనారాయణను అభినందిస్తున్న రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: టీటీడీ వైఖానస ఆగమ సలహాదారులుగా ఎస్వీ వేదిక్ వర్సిటీ వైఖానస విభాగ సహాయ ఆచార్యులు డీఆర్ పరాశరం భావనారాయణ నియమితులయ్యారు. వర్సిటీలో సోమవారం రిజిస్ట్రార్ డాక్టర్ పి.భాస్కరుడు ఆయన్ను అభినందించారు.

వేదిక్‌లో పలు కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: ఎస్వీ వేదిక్ వర్సిటీలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పలు కోర్సులకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ (శాస్త్రి), ఎంఏ (ఆచార్య), పీహెచ్‌డీ, సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తిగల అభ్యర్థులు అర్హత, దరఖాస్తు వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు. ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.





తిరుపతి నాలుగు కాళ్ల మండపం వద్ద ఏడు కొండల స్వామి వైపు చేయి చూపిస్తూ హామీల వర్షం కురిపిస్తున్న చంద్రబాబు, పవన్

శ్రీవారి సాక్షిగా.. పచ్చి అబద్ధాలు!

2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతి నాలుగుకాళ్ల మండపం సభా వేదికపై టీడీపీ అధినేత చంద్రబాబు ఏడు కొండల వైపు చేయి చూపిస్తూ శ్రీవేంకటేశ్వర స్వామి సాక్షిగా చెబుతున్నా...అంటూ జిల్లా ప్రజలకు పలు హామీలను గుప్పించారు. దీనికి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సైతం స్వరం కలిపారు. దేవునిపైన నమ్మకం, విశ్వాసం, సంకల్పం ఉంటేగానీ ప్రమాణం చేసే సాహసం చేయరు. అలాంటిది అలవోకగా ప్రమాణం చేస్తూ ఇచ్చిన హామీలను సైతం అమలు చేయకపోవడం పట్ల జిల్లా వాసులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఏడాది గడుస్తున్నా ఇంకెప్పుడు హామీలు అమలు చేస్తారు బాబూ అంటూ దెప్పిపొడుస్తున్నారు.

ఆధ్యాత్మిక నగరంలో అలవిగాని హామీలు

- ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ ప్రగల్భాలు
- అర్చకులకు నెలకు రూ.15 వేలు వేతనం అంటూ ప్రచారం
- 50 ఏళ్లు నిండిన ప్రతి బీసీకి పింఛన్ ఇస్తామని ప్రకటన
- ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన చంద్రబాబు
- స్వరం కలిపిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్
- ఏడాది గడుస్తున్నా హామీల జోలికెళ్లని అధినేతలు
- అధికారం కోసం నమ్మించి మోసం చేశారంటున్న జిల్లా ప్రజలు

తిరుపతి తుడా : అధికారం కోసం అడ్డదారులు తొక్కడం..అమలు కాని హామీలతో వంచించడం.. మాయమాటలు చెప్పి నమ్మించడం.. తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలకు విస్మరించడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య. 'నేను మారాను.. నన్ను నమ్మండి' అంటూ మొసలి కన్నీరు కార్చిన చంద్రబాబు మరోసారి ప్రజలను నిలువునా ముంచేశారు. ఏడాది గడుస్తున్నా ఒక్క హామీనీ సక్రమంగా అమలు చేయకపోవడంతో జిల్లా ప్రజలు రగిలిపోతున్నారు.

ఊరూరా నమ్మించి..వంచించి!

అధికారమే పరమావధిగా భావించే చంద్రబాబు మారిన మనిషిలా నటించారు. తనతోక పార్టీ అధినేతతో కలసి జిల్లాలో ఊరు వాడా తిరిగి సామాన్య, బడుగు బలహీన వర్గాలను టార్గెట్ చేసుకుని నమ్మించేశారు. తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తొలి సంతకం మెగా డీఎస్సీపై పెడతానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి సీఎంగా బాధ్యతలు తీసుకున్న చంద్రబాబు తొలి సంతకం హామీని అభాసుపాలు చేశారు. అంతటితో ఆగకుండా మరోసారి శ్రీవేంకటేశ్వర స్వామిని సాక్షిగా అంటూ రాష్ట్రంలోని దేవాలయ ట్రస్ట్‌బోర్డు నియామకాలలో బ్రాహ్మణులకు చోటు కల్పిస్తానని హామీ ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

పింఛన్లు తుంచి..అభాగ్యులను ముంచి

అధికారంలోకి వస్తే పెంచిన పింఛన్‌ను అమలు చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. అంతవరకు బాగానే ఉన్నా 12 నెలల కాలంలో ఒక్క కొత్త పింఛన్ ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనలో జిల్లా వ్యాప్తంగా కొత్త పింఛన్ల కోసం 15 వేల మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకపోతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2024 మే నెలకు 2,71,183 అందిచగా.. కూటమి ప్రభుత్వ హయాంలో 2025 జూన్ నెల వాటిని 2,60,379 తగ్గించేశారు.

దగా చేయడం పవనిజమా?

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు పవన్ కళ్యాణ్ తనదైన శైలిలో ఊగిపోతూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. చంద్రబాబుకు మించిన నాయకుడు లేడంటూ మద్దత్తు పలికారు. ఈ క్రమంలో తిరుపతి పర్యటనలో చంద్రబాబు ఇచ్చిన హామీలకు స్వరం కలిపారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమరరాజ ఫ్యాక్టరీని తిరుపతి నుంచి తరిమేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరరాజా ఫ్యాక్టరీని తిరిగి రప్పిస్తామంటూ ప్రగల్భాలు పలికారు. ఏడాది కావస్తున్నా తెలంగాణలో స్థాపించిన అమరరాజాను అక్కడ ఖాళీ చేయించి తిరుపతికి రప్పించే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం.

ఈవీ ఆటోలు.. ఎక్కడ లోకేశం!



తిరుపతి యువగళం సభలో ఆటోవాలా అవతారమెత్తి హామీలు గుప్పిస్తున్న లోకేష్

యువగళం పాదయాత్రలో భాగంగా తిరుపతి అంకుర ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేసిన సభలో తన తండ్రికి మించి నారా లోకేష్ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. నగరంలో అత్యధికంగా ఆటోలు ఉండడాన్ని గుర్తించిన లోకేష్ అండ్ కో వారితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఆటో డ్రైవర్‌లా ఖాకీ చొక్కా ధరించి వారికి పెద్ద దిక్కుగా ఉంటానని మాయ మాటలు చెప్పారు. డీజిల్ ఆటోలు నడపడం వల్ల ఖర్చు ఎక్కువ అవుతుందని, యూరప్ దేశాల తరహాలో తిరుపతిలోనూ ఎలక్ట్రికల్ చార్జింగ్ ఆటోలను నడపాలని సూచించారు. అధికారంలోకి వచ్చాకా ఆటోవాలాలందరికీ సబ్సిడీపై ఈవీ ఆటోలు కొనిచ్చే బాధ్యతను తాను తీసుకుంటానని నమ్మించారు.ఆధునిక హంగులతో ఆటో స్టాండు, చార్జింగ్ స్టేషన్‌లను అందుబాటులోకి తెస్తామని ఇచ్చిన హామీలకు ఏడాది కావస్తున్నా ఆ ఊసే ఎత్తకపోవడంపై ఆటోవాలాలు విమర్శలు గుప్పిస్తున్నారు. పేదలందరికీ రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలను ఇచ్చే బాధ్యతను తాను తీసుకుంటానంటూ నమ్మించి వంచిచడంపై రగిలిపోతున్నారు.

శ్రీవేంకటేశ్వర స్వామి సాక్షిగా!

- ఏడాదికి 4 లక్షల ఉద్యోగాల చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత నాదే
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తో సంక్షేమ పథకాలను మరింత పరుగులు పెట్టిస్తా
- తిరుమల పవిత్రతను కాపాడుతా
- 50 వేలకుపైగా వార్షిక ఆదాయం ఉన్న ఆలయాలలో పనిచేసే అర్చకులకు రూ.15వేలు వేతనం అందిస్తా
- అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న ఆలయాల అర్చకులకు రూ.5వేల నుంచి రూ.10 వేలు అందిస్తా
- పోటు వృత్తిని కుల వృత్తిగా పరిగణించి గుర్తిస్తాం
- బ్రాహ్మణ కార్పొరేషన్, బ్రాహ్మణ సొసైటీని బలోపేతం చేస్తాం
- 50 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తికీ పింఛన్ అందిస్తాం.
- షరతులు లేకుండా ప్రతి పేదవారికి పింఛన్‌లు పంపిణీ చేస్తాం

మాటిచ్చి నెరవేర్చకపోతే ఎలా?



ఎన్నికల సమయంలో చంద్రబాబు పుట్టిన రోజు గూడూరుకు విచ్చేశారు. అప్పుడు ఎన్నికల సభలో పలు హామీలు ఇచ్చారు. అధికారం చేపట్టిన వెంటనే వాటన్నింటినీ అమలు చేస్తామన్నారు. కానీ ఏడాది పూర్తవుతున్నా హామీల జోలికి వెళ్లడం లేదు. పేదలు నరకయాతన అనుభవిస్తున్నారు.

– కోట్లపూడి శ్రీనివాసులు, కాశీపురం, వాకాడు మండలం

ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు



చంద్రబాబు సత్యవేడు ఎన్నికల ప్రచార సభలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. కనీసం ఆ ప్రస్తావన ఎత్తకపోవడం దారుణం. ఏడాది పాలన పూర్తవుతున్నా సత్యవేడు ప్రజలకు కూటమి నేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై ఆగ్రహంతో ఉన్నారు. 100 పడకల ఆస్పత్రి మాటేలేదు. మున్సిపాలిటీగా గుర్తిస్తామన్నారు. ఆ ప్రస్తవన ఎత్తడం లేదు. బైపాస్‌రోడ్డు, ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటుపై స్పందించే నాయకుడేలేడు.

– శివయాదవ్, వరదయ్యపాళెం మండలం

అంతా గందరగోళం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక గందరగోళంగా మారింది. అధికారులు సమన్వయలోపంతో తొలుత కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించేందుకు ప్రత్యేక క్యూను ఏర్పాటు చేశారు. జేసీ, డీఆర్‌ఓ వంటి అధికారులకు వినతులు సమర్పించేందుకు మరో లైన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో తమ సమస్యలను నేరుగా కలెక్టర్‌కు విన్నవించాలని ప్రజలు ఒక్క సారిగా ప్రత్యేక క్యూలోకి చేరారు. పరిస్థితి గమనించిన అధికారులు ప్రత్యేక క్యూను రద్దు చేశారు.

మానవతా దృక్పథంతో పనిచేయండి

వచ్చిన అర్జీలకు నాణ్యతతో పరిష్కారం చూపి మానవతా దృక్పథంతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు, తసీల్దారులు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అర్జీదారుల సమస్యలపై అక్కడికక్కడే వర్చువల్‌గా మాట్లాడి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్‌ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, డీఎంహెచ్‌ఓ

తిరుపతి అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్, ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపైన్ బ్యానర్స్, పోస్టర్స్, పాంప్లెట్స్‌ను సోమవారం కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని సంస్థలను సమన్వయం చేసుకుని టీబీ నిర్మూలనకు ప్రజలను చైతన్య వంతులను చేయాలన్నారు. జేసీ శుభం బన్సల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, జిల్లా కుష్టు, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆనందమూర్తి పాల్గొన్నారు.

వంచించడం..బాబు నైజం!

- వెన్నుపోటు దినం రేపు
- కూటమి మోసాలను ఎండగడదాం
- వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా పార్లమెంటు పరిశీలకులు మేడా రఘునాథరెడ్డి



వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేదా రఘునాథరెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: రేపు జరగబోయే వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా పార్లమెంట్ పరిశీలకుడు మేడ రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ ఆత్మీయ సమావేశం సోమవారం పట్టణ వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ రఘునాథరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయకుండా 'వెన్నుపోటు' పొడిచిన టీడీపీ ప్రభుత్వ మోసపూరిత విధానానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయనున్నట్టు తెలిపారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, జిల్లా కలెక్టరేట్ వద్ద 'నిరసన కార్యక్రమాలు' చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శ్రీకాళహస్తిలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకొని కుట్రలు, కుతంత్రాలు భయానక వాతావరణాన్ని సష్టించాలని చూస్తున్నారన్నారు. అలాగే జూన్ 4న జరిగే వెన్నుపోటు దినాన్ని విజయవంత చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బత్తె సుదర్శన్ రెడ్డి, వయ్యాల కృష్ణారెడ్డి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఏర్పేడు మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, ఇన్‌చార్జ్ కిషోర్ రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షుడు గంగారి రమేష్, రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు, రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, తొట్టంబేడు మండల అధ్యక్షుడు కోగిల సుబ్రమణ్యం, కోవి చంద్రయ్య నాయుడు, ఢిల్లీ బాబు, జనార్ధన్‌యాదవ్, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరీది, గోరా, అస్లాం, బాబు, గపూర్, సాగిరబీ తదితరులు పాల్గొన్నారు.

లోగుట్టు పెరుమాళ్లకే ఎరుక

- రియల్టర్లకు అధికార యంత్రాంగం దాసోహం
- ఆగమేఘాలపైన అనుమతులు
- చెరువు, కలుజుకు అడ్డుగా ప్రహరీ గోడ నిర్మాణం
- దగ్గరుండి పనులు చేయిస్తున్న ఇరిగేషన్ అధికారులు



కలుజుకు అడ్డుగా ప్రహరీ గోడ నిర్మాణం



కలుజు నుంచి వచ్చే నీళ్ల కోసం ఏర్పాటుచేసిన పైపులు



చెరువు కింది భాగాన ప్రైవేట్ లేఅవుట్ పనులు

రేణిగుంట: ఇరిగేషన్ అధికారులు రియల్టర్లకు దాసోహమైపోయారు. చెరువు, కలుజులకు అడ్డుగా పనులు చేస్తున్నా తామే అనుమతించామంటూ చెప్పుకొస్తున్నారు. కానీ భారీ వర్షాలు వస్తే మాత్రం ముప్పుతప్పదని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇంతకీ ఇది ఎక్కడ.. ఆ కథ ఏందో మీరే చదవండి..

రేణిగుంట మండలం, జిపాళ్యం పంచాయతీలోని కుర్ర కాలువ గ్రామ లెక్క దాఖల సర్వే నంబర్ 18/1లో 4.21 ఎకరాల మేర సాగుకు పనికిరాని ప్రభుత్వ భూమి (డ్రైల్యాండ్) చెరువు కింద ఉంది. ఇక్కడ చెరువు నుంచి అధనపు నీళ్ల వెళ్లేందుకు కలుజు ఏర్పాటు చేశారు. కలుజు నుంచి వచ్చే నీళ్ల భూమి మధ్యలోని కాలువ ద్వారా పద్మానగర్ మీదుగా ఏర్పేడు మండలం, వికృతమాల చెరువుకు చేరుతాయి.

వాటిని చేతిలో పెట్టుకుని..

గతంలో పక్కనే ఉన్న డీకేటీ భూమికి చెందిన పత్రాలు పెట్టుకొని ఫ్రీ హోల్డ్‌లో రెవెన్యూ అధికారుల ద్వారా కొందరు రియల్టర్లు అనుమతులు పొందారు. ఇదే అదునుగా కలుజు భూమి పై కన్నుపడింది. అధికార పార్టీ నియోజకవర్గ నేత అండదండలతో ఇరిగేషన్ అధికారుల నుంచి కలుజు కాలువకు పైపులు వేసేందుకు అనుమతులు తీసుకున్నారు. సుమారు 30 అడుగుల వెడల్పుతో ఉన్న కలుజుకు మధ్యలో రెండు పైపులను వేసి మట్టి తోలి పూడ్చివేశారు. కలుజు కింద భూమిలో లేఅవుట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

చర్యలేవి

తిరుపతి–పాపానాయుడుపేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న భూమి కావడంతో రియల్టర్లు కన్ను పడింది. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అటువైపు వెళ్లేందుకు సాహసించడం లేదు. కాలువ పోరంబోకులో పేదలు చిన్న ఇల్లు నిర్మించుకుంటేనే కూలదోసే.. రెవెన్యూ అధికారులు ఇంత జరుగుతా అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మేమే అనుమతిచ్చాం

సోమవారం ఉదయం కలుజు ప్రహరి గోడ మధ్య ట్యాంకు నిర్మించేందుకు జేసీబీతో పెద్ద గుంతను తవ్వారు. ఇరిగేషన్ డీఈ ప్రకాష్‌రావు చెరువు వద్దకు చేరుకొని పరిశీలించి తమ అనుమతులతోనే చేస్తున్నారని చెప్పారు. పైపుల పైన ఎటువంటి నిర్మాణం జరపరని తెలిపారు. కానీ కలుజుకు అడ్డుగా పైపుల పైన ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేశారు. అది రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు మాత్రం కనబడకపోవడం గమనార్హం.



ప్రవహిస్తున్న కలుజు (ఫైల్)

వర్షమొస్తే ముప్పే

99 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువుకు ఉండేది ఒకటే కలుజు. చెరువు నిండిన తర్వాత అధనపు నీళ్లు వెళ్లే కలుజు కింద 10 అడుగుల దూరంలో ప్రహరీ గోడ అడ్డుగా నిర్మించారు. గతంలో భారీ వర్షాలు పడినప్పుడు చెరువు నీళ్లు కలుజు గుండా వెళ్లేవి. పద్మానగర్‌లోని సగం ఇళ్లు మునకకు గురయ్యేవి. ఇంతటి నీటి ప్రవాహం వచ్చే ప్రదేశంలో లే అవుట్ వేసి అమాయకులకు ప్లాట్లు అమ్మే ఏర్పాట్లు చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. భారీ వర్షాలొస్తే ఇబ్బందులు తప్పవని స్థానికులు చెబుతున్నారు.

అనుమతులతోనే పనులు

"మా నుంచి అన్ని అనుమతులు తీసుకున్నారు. కలుజు నుంచి వచ్చే నీళ్లను అంచనా వేసి, మేము డిజైన్ చేసిన విధంగానే రియల్టర్లు పనులు చేస్తున్నారు. పైపులు పైన ఎటువంటి నిర్మాణాలు చేపట్టరు. ముందు కాలువ ద్వారా నీళ్లు పోయేవి, ఇప్పుడు పైపుల ద్వారా నీళ్లు వెళతాయి. ఎంత వాన వచ్చిన ఎటువంటి ఇబ్బందీ ఉండవు.

– ప్రకాష్‌రావు, ఇరిగేషన్, డీఈ, శ్రీకాళహస్తి

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరుపులు

తిరుపతి ఎడ్యుకేషన్ : దేశంలోని ప్రముఖ ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి కేంద్ర విద్యాసంస్థల్లో ప్రవేశాలకు ఏటా ఎన్టీఏ ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తోంది. ఈ ఏడాది మే 18న జాతీయ స్థాయిలో నిర్వహించిన అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో తిరుపతి జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. జిల్లాలోని వివిధ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఓపెన్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ వంటి కేటగిరీల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఓపెన్ కేటగిరిలో ఎం.భానుచరణ్‌రెడ్డి జాతీయ స్థాయిలో 51వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 4వ ర్యాంకు సాధించాడు. అలాగే డీ.మణిదీప్‌రెడ్డి ఓపెన్ కేటగిరిలో 345వ ర్యాంకు, జి.హిమేష్‌రాఘవ చంద్ర ఓపెన్‌లో 468, ఓబీఎస్ కేటగిరిలో 61వ ర్యాంకు, ఎం.శశాంక్‌రెడ్డి ఓపెన్‌లో 618, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 40వ ర్యాంకు, కె.యశ్విత ఓపెన్‌లో 906, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 67వ ర్యాంకు సాధించారు. వీరితో పాటు పలువురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ‘శ్రీచైతన్య’ విజయకేతనం

తిరుపతి ఎడ్యుకేషన్ : జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని శ్రీచైతన్య విద్యాసంస్థ విద్యార్థులు జాతీయ స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. సోమవారం ఆ విద్యాసంస్థలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏజీఎం బీవీ.ప్రసాద్ వివరాలను వెల్లడించారు. ఈ ఫలితాల్లో పి.సాయిముకేష్ 115వ ర్యాంకు, ఎం.మునికృష్ణ 228, ఎస్.అశోక్‌నాయక్ 542, ఎం.భరత్ 847, సి.సహస్ర 1202, బీఆర్.కుశ్యాయప్పనాయక్ 1,335, మోక్షిత్‌శర్మ 1,371, జ్ఞానసాత్విక్ 1,625, అమూల్య 1,830, కె.అభిరామ్ సాయి 2017, గంగా మనోజ్‌కుమార్ 2,333, ఎ.మణి 2453, జ్ఞానదీక్షిత 3,450, ఎస్.భాను ప్రకాష్ 3,992, కె.జీవన్ కుమార్ 4,099, కె.కార్తికేయ 4,696, ఎం.కావ్య 4,698, వరుణ్‌తేజ్ 5,161, ఎస్.హేమంత్‌చౌదరి 5,189, మణీష్ 5,263, వీరితో పాటు 42 మంది తమ విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ డీన్‌లు కెఎల్‌జి.ప్రసాద్, రామమోహన్‌రావు, శ్రీనివాసరావు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు అభినందించారు.


జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీచైతన్య విద్యాసంస్థ డీన్‌లు

సాఫ్ట్‌వేర్ ఇంజనీరవుతా



ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తిరుపతికి చెందిన దేశిరెడ్డి మణిదీప్‌రెడ్డి జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరిలో 345వ ర్యాంకు సాధించాడు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరు డి.గిరిప్రసాద్‌రెడ్డి, ఎస్వీ అగ్రికల్చర్ కళాశాల ప్రొఫెసర్ అమరావతి దంపతుల కుమారుడైన మణిదీప్‌రెడ్డి ఐఐటీ చెన్నైలో సీఎస్ఈ చదవాలన్నది తన కోరిక అని తెలిపాడు. సీఎస్ఈ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా స్థిరపడడమే తన లక్ష్యమని తెలిపాడు.

–దేశిరెడ్డి మణిదీప్‌రెడ్డి, తిరుపతి

అది నా కల

చెన్నై ఐఐటీలో సీటు సాధించి కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదవడమే తన కోరిక అని ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయి ఓపెన్ విభాగంలో 468, ఓబీసీ కేటగిరిలో 61వ ర్యాంకు సాధించిన తిరుపతి విద్యార్థి జి.హిమేష్‌రాఘవ చంద్ర తెలిపాడు. శ్రీసత్యసాయి జిల్లా, పెనుగొండలో వెటర్నరీ డాక్టరుగా పనిచేస్తున్న జి.నాగేంద్ర, జి.జ్యోతి దంపతుల కుమారుడు హిమేష్‌రాఘవ చంద్ర. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలన్న తపనతో ర్యాంకు సాధించానని తెలిపాడు.

–జి.హిమేష్‌రాఘవ చంద్ర, తిరుపతి



సాఫ్ట్‌వేర్‌లో రాణిస్తా



ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తిరుపతికి చెందిన ఎం.శశాంక్‌రెడ్డి జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరిలో 618, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 40వ ర్యాంకు సాధించాడు. ప్రైవేటు టీచరుగా పనిచేస్తున్న ఎం.ప్రహ్లాదరెడ్డి, ఎం.రెడ్డిరాణి దంపతుల కుమారుడైన శశాంక్‌రెడ్డి ప్రముఖ ఐఐటీలో సీటు సాధించి సీఎస్ఈ చేయాలన్నది తన కోరిక అని తెలిపాడు.

– ఎం.శశాంక్‌రెడ్డి, తిరుపతి

అదే నా లక్ష్యం

సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడమే తన లక్ష్యమని విద్యార్థిని కళత్తూర్ యశ్విత తెలిపారు. తిరుపతికి చెందిన ప్రైవేటు లెక్చరర్ కె.నాధమునిరెడ్డి, ఎం.బిందు దంపతుల కుమార్తె యశ్విత ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయి ఓపెన్ విభాగంలో 906వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 67వ ర్యాంకు సాధించింది.

–కళత్తూర్ యశ్విత, తిరుపతి



ఏఐ రంగంలో రాణించాలి



ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తిరుపతికి చెందిన ఎం.భానుచరణ్‌రెడ్డి జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరిలో 51వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 4వ ర్యాంకు సాధించాడు. శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎం.జయభారత్ రెడ్డి, ఎం.సురేఖ దంపతుల కుమారుడైన భానుచరణ్‌రెడ్డి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) రంగంలో రాణించడమే తన లాంగ్ టర్మ్ గోల్ అని తెలిపాడు. ప్రస్తుతం ఐఐటీ బాంబేలో సీటు పొంది సీఎస్ఈ చదవడమే తన లక్ష్యమని తెలిపాడు.

– ఎం.భానుచరణ్‌రెడ్డి, తిరుపతి

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ


ర్యాంకు సాధించిన నితిన్‌రెడ్డి

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని ఐసీఎస్ రోడ్డుకు చెందిన వేగూరు నితిన్‌రెడ్డి జాతీయ స్థాయిలో 535వ ర్యాంకు సాధించాడు. నితిన్ రెడ్డి తండ్రి రవీంద్రరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తల్లి సుచిత్ర సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్. నితిన్‌రెడ్డి హైదరాబాద్‌లో చదువుకుంటూ అక్కడే కోచింగ్ తీసుకుని జాతీయ స్థాయిలో రాణించాడు.

క్లుప్తంగా

బ్రాహ్మణ సంఘం అధికార ప్రతినిధిగా బాలాజీ శర్మ


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

నగరి: తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘాల సేవా సమితి అధికార ప్రతినిధిగా పుత్తూరుకు చెందిన బాలాజీ శర్మ నియమితులయ్యారు. సోమవారం బ్రాహ్మణ సంఘ ఆవిర్భావ దినోత్సవం శ్రీకాళహస్తి బ్రాహ్మణ భవనంలో వేడుకగా జరిగింది. చంద్రగిరి, శ్రీకాళహస్తి, నగరి, పుత్తూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి, రేణిగుంట, తాటితోపు తదితర బ్రాహ్మణ సంఘాలు అన్నిటిని కలుపుతూ బ్రాహ్మణులంతా ఐక్యంగా ఒక తాటి మీదకు రావాలనే సంకల్పంతో రాష్ట్ర యువజన అధ్యక్షుడు, తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘాల సేవా సమితి ప్రధాన కార్యదర్శి శ్రీవేదం హరిప్రసాద్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధికార ప్రతినిధిగా బాలాజీ శర్మ, సంయుక్త కార్యదర్శిగా బాలాజీ రావు, మహిళా విభాగం నుంచి టీకే లలిత, కలంచేరీ గీతలను నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు, క్రమశిక్షణ మండలి అధ్యక్షుడు కొత్తపల్లి అజయ్‌కుమార్, శ్రీకాళహస్తి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ప్రకాశం, పుత్తూరు బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు ఆలూరు రామకృష్ణ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

286 కిలోల ఎర్రచందనం స్వాధీనం

రేణిగుంట: కడప వైపు నుంచి రేణిగుంట వైపు వస్తున్న వాహనాన్ని ఫారెస్ట్ అధికారులు అనుమానంతో ఆపగా వాహనాన్ని వదిలి డ్రైవర్ పరారయ్యాడు. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 286 కిలోల బరువు గల తొమ్మిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వివరాలు.. తిరుపతి అటవీ క్షేత్రాధికారి బీ.సుదర్శన్‌రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు టీఎన్.పాలెం సెక్షన్ సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి 11.30 గంటలకు కడప నుంచి రేణిగుంట రోడ్ వరకు పెట్రోలింగ్ చేయగా.. రాత్రి 11.45 గంటలకు ఒక వాహనం అతివేగంగా రావడం గమనించారు. అటవీ అధికారులు శ్రీ నివాసపురం వద్ద ఆ వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా డ్రైవరు వాహనంలో నుంచి దూకి పరారయ్యాడు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్ఓ చైతన్య, ఎఫ్‌బీఓ కే.వెంకటేశ్వరరావు, ప్రొటెక్షన్ వాచర్లు సిసింద్రీ, వెంకటేష్, ప్రసాద్, నవీన్, రవి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు అమ్మేస్తున్న..
డిప్యూటీ తహసీల్దారుపై చర్యలు తీసుకోండి

- అసలైన ఉద్యోగం పక్కనబెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం
- భూ ఆక్రమణలకు అసలైన సూత్రధారి డిప్యూటీ తహసీల్దారే
- కలెక్టర్‌కు విన్నవించిన తిరుపతి రూరల్ ఎంపీపీ, వైస్ ఎంపీపీ


డిప్యూటీ తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న తిరుపతి రూరల్ ఎంపీపీ, వైస్ ఎంపీపీ

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ తహసీల్దారు కార్యాలయంలో ప్రధాన డిప్యూటీ తహసీల్దారు గా విధులు నిర్వహిస్తున్న మోహన్ అసలైన ఉద్యోగం వదిలిపెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అమ్మేస్తున్నారని తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్ర మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి ఆయన భాగోతాన్ని వివరించారు. ఇంకా ఏం చెప్పారంటే.. మండలంలోని అన్ని గ్రామాల్లో తన ద్విచక్ర వాహనంపై ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు తిరుగుతూ విలువైన ప్రభుత్వ భూములు, కాలువలు, కుంటలు, బంజరు భూములు, రెవెన్యూకు సంబంధం లేని మఠం భూములను సైతం పరిశీలించి.. ఆక్రమణదారులకు ధారాదత్తం చేస్తున్నాడని ఆరోపించారు. ఆ తరువాత భూములు ఆక్రమించిన అక్రమార్కులతో కలసి ఆ భూములను అడ్డదారిలో అమ్మేసి 25 శాతం వాటా తీసుకుంటున్నారని వివరించారు. ఒక బాధ్యత గల రెవెన్యూ అధికారిగా ఉండాల్సిన వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలసి భూములు అమ్మేస్తుండడం ఏమిటని ప్రశ్నించారు. ఈ మేరకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఈ సమస్యను లేవనెత్తారని తెలిపారు. ఏదైనా పనిమీద తహసీల్దార్ కార్యాలయానికి వెళితే సదరు డెప్యూటీ తహసీల్దార్ తన చుట్టూ తిప్పించుకోవడం రివాజుగా మారుతోందన్నారు. డబ్బులు ముట్టజెబితేగానీ పనులు చేయడం లేదని చెప్పారు. స్థానిక తహసీల్దార్ కూడా డెప్యూటీ తహసీల్దార్ కనుసన్నల్లో పనిచేస్తున్నారని, ఆయన చెప్పందే ఒక్క ఫైలు కూడా ముందుకు కదలనీయడం లేదని తెలిపారు. ప్రజలను అన్ని రకాలుగా ఇబ్బందులు పెడుతున్న సదరు డెప్యూటీ తహసీల్దార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆ ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ సమగ్ర విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి


మృతుడు కాలేషా(ఫైల్)

ఏర్పేడు: మండలంలోని వికృతమాల టీసీఎల్ కంపెనీ సమీపంలో విధులు ముగించుకుని వెళుతూ బైక్ నుంచి అదుపు తప్పి కిందపడి ఓ యువకుడు మృతి చెందాడు. ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. బాపట్ల జిల్లా, ఇంకోలుకు చెందిన మహబూబ్ జానీ కుమారుడు కాలేషా(25) మూడు నెలల కిందట వికృతమాల సమీపంలోని టీసీఎల్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా చేరాడు. స్థానికంగానే ఉంటూ ఇక్కడే పనిచేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై బయల్దేరాడు. కొంత దూరంలోనే స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపు తప్పడంతో కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో కాలేషా తలకు బలమైన రక్తగాయమైంది. క్షతగాత్రుని 108 వాహనంలో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతదేహానికి తిరుపతి ఎస్వీ వైద్యకళాశాలలో పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

వైఎస్సార్‌సీపీలో చేరికలు


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పిన ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

కోట: కూటమి ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆరోపించారు. ఆయన సోమవారం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న మోసాలపై బుధవారం గూడూరులో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పార్టీలో చేరిన పలువురు యువకులు

చిట్టమూరు మండలం, ఎల్లూరుకు చెందిన 20 మంది యువకులు, కోటకు చెందిన పలువురు యువకులు మేరిగ మురళీధర్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. గూడూరు నియోజకవర్గంలో కార్యకర్తలకు అందుబాటు ఉంటానని హామీ ఇచ్చారు. కోట, చిట్టమూరు మండలాల కన్వీనర్లు పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ అంజమ్మ, జెడ్పీటీసీ కోటయ్య, నాయకులు భక్తవత్సల్‌రెడ్డి, రమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, నాగూర్ రెడ్డి, రాఘవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్ నాయుడు, ఎన్వీ రమణయ్య, కస్తూరిరెడ్డి, షనీల్‌రెడ్డి, రాజారెడ్డి, కోటేశ్వరరెడ్డి, పి.సురేంద్ర పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చండి


ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్మికులు

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పీ.హరినాథ్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట, సీపీఐ నాయకులు, పేదలు, కార్మికులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికల హామీలను నెరవేర్చాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 32లక్షల మందికి ఇంటి పట్టాలు ఇచ్చారని గుర్తుచేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు పలు సభల్లో గ్రామాల్లో 3సెంట్లు, పట్టణాల్లో 2సెంట్లు చొప్పున అర్హులకు స్థలాలు ఇవ్వాలని, అధికారంలోకి వస్తే ఆ విధంగా స్థలాలు మంజూరు చేస్తామని హామీలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అవగాహన ఉన్న చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను ప్రకటించారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా వాటిని అమలు చేయలేకపోయారని మండిపడ్డారు. పింఛన్ తప్ప ఏ ఒక్క హామీనైనా కూటమి ప్రభుత్వం అమలు చేసిందా అని ప్రశ్నించారు. పోలవరం, అమరావతి చుట్టూ దృష్టి మరల్చి రాష్ట్ర ప్రజల స్థితిగతులను గాలికొదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సొంతగూడు కోసం పేదలు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారని, ఇంటి నిర్మాణం కోసం రూ.3లక్షలు చొప్పున అందజేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులు శివారెడ్డి, కార్యదర్శి విశ్వనాథ్, ఎన్‌డీ రవి, కేవై రాజ పద్మనాభరెడ్డి, రామక్రిష్ణ, బలరాం, రత్నమ్మ, శ్రీరాములు, శివ, విజయ, రామమూర్తి, కాలయ్య, మునిశ్వర్, ప్రమీల, వెంకటేష్, బాషా తదితరులు పాల్గొన్నారు.

మోటార్ల దొంగలు అరెస్ట్


స్వాధీనం చేసుకున్న రాగి వైర్లు

ఏర్పేడు:విద్యుత్ మోటారు స్టార్టర్లు, వైర్లను దొంగలిస్తున్న ముఠాను సోమవారం ఏర్పేడు పోలీసులు అరెస్ట్ చేసినట్లు రేణిగుంట డీఎస్పీ వై.శ్రీనివాసరావు తెలిపారు. ఏర్పేడు పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఎస్పీ విష్ణువర్దన్ రాజు ఆదేశాలతో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. ఏర్పేడు మండంలో ఆరు కేసులు, రేణిగుంట, గాజులమండ్యం, శ్రీకాళహస్తి రూరల్ మండలాల్లోని కేసులకు సంబంధించి దర్యాప్తు చేపట్టినట్టు వెల్లడించారు. సాంకేతిక సహాయంతో దొంగతనాలు జరుగుతున్న తీరుపై ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి, గాజులమండ్యం సీఐ మంజునాథ్ రెడ్డి, ఏర్పేడు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎస్ఐ ధర్మసింగ్, సిబ్బందితో కలసి సమగ్ర దర్యాప్తు చేసినట్లు వివరించారు. సోమవారం వికృతమాల టీసీఎల్ కంపెనీ సమీపంలో నిందితులను అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద నుంచి 40 ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైరు, 77 స్టార్టర్ల రాగి వైరు మొత్తం 795 కిలోల రాగి వైరును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పట్టుబడిన నిందితులలో శ్రీకాళహస్తి మండలం, ఎర్రగుడిపాడుకు చెందిన కె.వెంకట్రామయ్య(45), శ్రీకాళహస్తికి చెందిన కత్తి మణి(35), ఎర్రగుడిపాడుకు చెందిన జెండా వెంకటేష్ అలియాస్ చిరంజీవి(45) ఉన్నట్టు తెలిపారు. ఈజీ మనీ కోసం దొంగతనాలు చేస్తున్నట్లు వెల్లడించారు. వీరి నుంచి ఈ స్క్రాబ్‌ను తిరుపతికి చెందిన ఖాదర్‌బాషా, సయ్యద్‌వాజిద్ హుస్సేన్, షేక్ బషీద్, శ్రీకాళహస్తికి చెందిన షేక్ హుస్మాన్, వెంకటగిరికి చెందిన సత్నా గోపాలకృష్ణ తక్కువ ధరకు కొనుగోలు చేశారని, చోరీ సొత్తు అని తెలిసి కూడా కొనుగోలు చేయడంతో వీరి ఐదుగురినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. నిందితులపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేశామన్నారు.

నెత్తిన బరువు పెట్టారు బాబూ!


రేషన్ బియ్యం మూటతో కుంటు కుంటూ నడుస్తున్న వృద్ధురాలు


తిరుపతి: మధ్యాహ్నం వేళ రేషన్ దుకాణం వద్ద క్యూలో వేచి ఉండలేక తమ సంచులను క్యూలో పెట్టిన దృశ్యం


రేషన్ దుకాణం నుంచి ఆటోలో వెళ్తున్న వృద్ధురాలు

తిరుపతి జిల్లాలో రేషన్ కష్టాలు కొనసాగుతున్నాయి. ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో లబ్ధిదారులు చౌకదుకాణాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈనెల 15వ తేదీ వరకు మాత్రమే రేషన్ అందించనుండడంతో కార్డు దారులు క్యూ కడుతున్నారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 1,457 రేషన్ దుకాణలు ఉండగా.. వీటిలో 300 దుకాణాల దాకా ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జ్ డీలర్లకు అప్పజెప్పడంతో వారు ఒక గంట రెగ్యులర్ షాపు వద్ద.. మరో గంట ఇన్‌చార్జ్ షాపు వద్ద సరుకులు ఇవ్వాల్సి వస్తోంది. ఇదిలావుండగా కంది పప్పు, చక్కెర అరకొర ఇస్తుండడంపై కార్డుదారులు మండిపడుతున్నారు.

– తిరుపతి అర్బన్